క్లుప్తంగా

గొల్లగూడెంలో ఉచిత వైద్యశిబిరం



గొల్లగూడెంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గొల్లగూడెం హైస్కూల్లో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. చేబ్రోలు లయన్స్ క్లబ్, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సంయక్తంగా ఈ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఏలూరు కామినేని హాస్పిటల్ డాక్టర్ కొడాలి రామ్‌ప్రసీన్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. సుగర్, బీపీ, గుండె వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో లయన్ బొమ్మిరెడ్డి రంగరావు, ఆర్థిక సాయంతో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి వైద్య సేవలు అందుకున్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రమణ, చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పుసులూరి ప్రకాష్, లయన్ సభ్యుడు బొమ్మిరెడ్డి రంగారావు, గుణ్ణం బుల్లబ్బాయి, వంకిన ప్రతాప్, శీతాల సత్యనారాయణ, శాక మూడి మురళీకృష్ణ, నిర్మల పాల్గొన్నారు.

గంగానమ్మకు పూజలు



అమ్మవారికి భక్తులు సమర్పించిన నైవేద్యాలు

దెందులూరు: పోతునూరు గ్రామంతో పాటు శివారు గ్రామాల ప్రజలందరూ పాడి పంటలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో అతివృష్టి, అనావృష్టి కలగకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పోతునూరు గ్రామ దేవత గంగానమ్మను గ్రామస్తులు కోరుకున్నారు. ఆదివారం దెందులూరు మండలం పోతునూరులోని గంగానమ్మ జాతర కార్యక్రమాన్ని గ్రామస్తులందరూ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. కొంతమంది మొక్కులు చెల్లించుకున్నారు, గ్రామస్తులు పెద్ద ఎత్తున గంగానమ్మ జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు.

21నుంచి దోసపాడులో సువార్త మహాసభలు

దెందులూరు: దోసపాడులో ఈనెల 21, 22, 23, 24 తేదీల్లో ఏసుక్రీస్తు ఆలయ 48వ వార్షికోత్సవ వేడుకలు, సువార్త మహాసభలు నిర్వహించనున్నట్టు పాస్టర్ సీహెచ్‌ఎస్ పాదం తెలిపారు. ఆదివారం దోసపాడులో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు దేవాలయంలో సువార్త మహాసభలు నిర్వహిస్తామన్నారు. మహాసభలు కొనసాగే నాలుగు రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నలుగురు సువార్తీకులు వాక్య పరిచర్యకు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



అమ్మవారి పోస్టర్‌ను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

దెందులూరు: గాలయిగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 68వ వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఏలూరు జెడ్పీ చైర్ పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. భక్తులు ఉత్సవాలకు హాజరై అచ్చమ్మ తల్లి దీవెనలు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి చిన్న సమస్య తలెత్తినా వెంటనే వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వినియోగిస్తూ కంటి చూపును కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు సూచించారు. ఆదివారం రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు 112 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపి 11 మందిని శస్త్రచికిత్స నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. మరో 32 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ప్రతినెలా మూడో ఆదివారం రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని, అవసరమైనవారు వినియోగించుకోవాలని రామారావు కోరారు.

సచివాలయ ఉద్యోగులపై క్రమబద్ధీకరణ కత్తి!

- ఉద్యోగులను మూడు విభాగాలుగా విభజన
- కొత్త పోస్టులకు మంగళం
- ఉన్నవారితోనే విధులు
- నియోజకవర్గంలో 127 పోస్టులు ఖాళీ

నిడమర్రు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పలు పథకాలను నిలుపుదల చేయడమే కాకుండా కొన్నిటికి పేర్లు మార్చింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలు చేసిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు సంబంధించి చంద్రబాబు సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నవారితోనే సర్దుబాటులో భాగంగా సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరణకు సర్కారు శ్రీకారం చుట్టబోతోంది. ఈ మేరకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా గ్రామ జనాభా ప్రాతిపదికన సచివాలయ ఉద్యోగులను కేటాయించనున్నారు. ఆయా సచివాలయాల్లో ఉద్యోగులను మూడు కేటగిరీలుగా విభజించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

మిగులు ఉద్యోగులను ఇతర శాఖల్లో వినియోగించేందుకు ప్రయత్నం

తాజా మార్గదర్శకాల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మూడు విభాగాలుగా విభజించనున్నారు. మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్, యాస్పిరేషనల్ సెక్రటరీలుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామ సచివాలయాల్లో మల్టీపర్పస్ ఫక్షనరీలుగా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీలుగా వీఆర్వో, ఏఎన్‌ఎం, సర్వే సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు, అగ్రికల్చర్ సహాయకులు, వెటర్నరీ సహాయకులు, ఎనర్జీ కార్యదర్శి ఉంటారు. హేతుబద్ధీకరణ అనంతరం మిగులు ఉద్యోగుల్లో ఉన్నత విద్యార్హత కలిగిన సాంకేతిక సంబంధిత కోర్సులు చేసి ఆసక్తి చూపినవారిని అస్పిరేషనల్ ఫంక్షనరీలుగా తీసుకుంటారు. ప్రతి సచివాలయంలో రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్లు (ఆర్టీజీఎస్) ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను వీరికి అప్పగిస్తారని అధికారులు చెప్తుతున్నారు. ఇంకా ఉద్యోగులు మిగి లితే సచివాలయాల శాఖలోనే కొనసాగిస్తూ ఇతర ప్రభుత్వ శాఖల్లో వినియోగించుకోనున్న ట్లు తెలుస్తోంది. అంటే అగ్రికల్చర్ అసిస్టెంట్, వ్యవసాయ శాఖలో, ఏఎన్‌ఎంలను వైద్య ఆరోగ్య శాఖలో సర్దుబాటు చేయనున్నారు.



గత ప్రభుత్వంలో నిర్మించిన బువ్వనపల్లి సచివాలయ భవనం

జనాభా ఆధారంగా ఉద్యోగులు ఇలా..

- 2,500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీ పర్పస్ ఫంక్షనరీలు, నలుగు టెక్నికల్ ఫంక్షనరీలతో కలిపి ఆరుగురు ఉద్యోగులు ఉంటారు.
- 2,500 నుంచి 3,500 మంది జనాభాకు ముగ్గురు మల్టీ పర్పస్ ఫంక్షనరీలు, నలుగు టెక్నికల్ ఫంక్షనరీలతో కలిపి ఏడుగురు ఉద్యోగులు ఉంటారు.
- 3,501 నుంచి ఆపై జనాభాకు నలుగురు మల్టీ పర్పస్ ఫంక్షరీలు, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఎనిమిది మంది ఉంటారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో సచివాలయ ఉద్యోగుల వివరాలు

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	ఉద్యోగులు
గణపవరం	25	20	173
నిడమర్రు	16	14	102
భీమడోలు	13	15	147
ఉంగుటూరు	25	27	216
మొత్తం	79	76	638

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణ



గ్రామ సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఉన్నత అధికారుల నిర్ణయం మేరకు చేపడతాం. దీనిపై పూర్తిస్థాయి అవగాహన కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించే అవకాశం ఉంది. ఒక్కో చోట ఒక్కోలా సచివాలయ సిబ్బంది ఉన్నారు. సచివాలయల్లో సిబ్బంది అసమతుల్యంగా ఉండటంతో రేషనలైజేషన్ ద్వారా ఈ సమస్యలు పరిష్కరించి అన్ని సచివాలయాల్లో తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచవచ్చు.

– ఆర్.బీబీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో, గణపవరం

765 మందికి 638 మంది విధులు

ఉంగుటూరు నియోజకవర్గంలో 76 సచివాలయల్లో మొత్తం పోస్టులు 765. ప్రస్తుతం విధులు నిర్వహిస్తోంది 638 మంది. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గంలోని 76 సచివాలయాలను పరిశీలిస్తే ఉన్న 638 మందిలో 30 నుంచి 40 పోస్టులు సర్దుబాటు చేయగా ఇంకా కొంతమంది మిగులుతున్నట్లు అధికారులు లెక్కలు కడుతున్నారు. దీంతో గ్రామ సచివాలయాలకు గత ప్రభుత్వంలో మంజూరైన పోస్టుల్లో కోత విధించడమే కాకుండా మరో 40 పోస్టుల వరకూ ప్రభుత్వం సర్దుబాటు పేరుతో ఉద్యోగులపై కత్తి వేయనుంది.

ప్రజల్లో చైతన్యం రేకెత్తించిన మహనీయుడు వేమన

భీమడోలు: ప్రజాకవి, దార్శనికుడు యోగి వేమన మహా జ్ఞాని అని ఆయన సమాజానికి అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘ సంస్కర్త యోగి వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవవ జీవితానికి చెందిన అనేక నిత్య సత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి వేమన తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న చిరస్మరణీయుడన్నారు. ఆయన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం రేకెత్తించిన మహనీయుడన్నారు. అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలల చిన్నారులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని పుస్తక పఠనం చేసారు. వాటిపై సమీక్షలు రాసారు. ఈ కార్యక్రమాల్లో పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

21 ఆధార్ మొబైల్ క్యాంపులు

భీమడోలు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రత్యేక ఆధార్ మొబైల్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆదివారం తెలిపారు. ఆగడాలలంక, పూళ్ల, భీమడోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు, చెట్టున్నపాడు, కురెళ్లగూడెం, సూరప్పగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో 23 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ నంబర్లు, ఆధార్ కార్డుల్లోని మార్పులు, సవరణలు ప్రజలు చేయించుకోవచ్చని తెలిపారు.

కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్లకు తెల్ల దోమ తెగులు





కొబ్బరి చెట్లకు ఆశించిన తెల్ల దోమ తెగులు, ఆయిల్‌పామ్ చెట్టును ఆశించిన తెల్ల దోమ తెగులు

దెందులూరు: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కనిపించే తెల్ల దోమల వల్ల నష్టపోకుండా ప్రతి రైతు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దెందులూరు నియోజకవర్గం ఉద్యానశాఖాధికారి అన్నారు. తెల్లదోమ ఆకుల్లోని రసాన్ని పూర్తిగా పీల్చి ఆకులు అడుగు భాగాన వల ఆకారంలో గుడ్లను పెట్టి వృద్ధి చెందుతాయని తెలిపారు. వాటికి సంబంధించి అవగాహన కల్పించేందుకు, నివారణ మార్గాలు సూచించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరికైనా ఆయిల్‌పామ్, కొబ్బరి ఇలాంటి పంటల్లో తెల్లదోమ సమస్య ఉంటే ఉద్యానవన శాఖ అధికారులు సంప్రదించి వారు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులు ఉద్యానవన పంటలకు సంబంధించి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించాలన్నారు.

నేడు భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భీమడోలు: స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ఈనెల 20వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆదివారం తెలిపారు. భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

అమిత్ షా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

దెందులూరు: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సభలో అవమానించిన హోం మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కూటమి నాయకులు రాచ మర్యాదలు చేయడం దేనికి సంకేతమని మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కొవ్వలి కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరిని విడనాడాలన్నారు. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై నేటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దారుణమన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నా ఇప్పటికీ ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోవడం బాధాకరమని జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు.

జనార్దన స్వామికి 'కల్కి' అలంకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని భూనీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి శ్రీ కల్కి అవతార అలంకరణ చేశారు.

ఘనంగా త్యాగరాజస్వామి శాంతి కల్యాణోత్సవం



గుండుగొలనులో శాంతి కల్యాణోత్సవంలో పూజలందుకుంటున్న సీతారామస్వామి



ఆలయంలో త్యాగరాజస్వామికి పూజలు చేసిన అర్చకులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుండుగొలనులోని సీతారామస్వామి ఆలయంలో కొలువైన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగించారు. ఆలయ ఫౌండర్ కొండా గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏటా ఐదు రోజుల పాటు లోక కల్యాణార్థం, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆరాధనోత్సవాలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయంలోని సీతారామస్వామి, త్యాగరాజ స్వామి వార్లకు అభిషేకాలు చేశారు. ఆలయంలో శాంతి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి సుధీరాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసారు. భజన సంకీర్తనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు



కొమ్మర పంట కాలువలో కొట్టుకు వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు



పిప్పర పంట కాలువ వెంబడి చెత్త కుప్పలు



గోపవరం పంట కాలువ గట్టుపై పేరుకుపోయిన చెత్త

- కాలువ గట్ల వెంబడే చెత్త డంపింగ్
- ప్లాస్టిక్ వ్యర్థాలతో జలాలు విషపూరితం
- పంటలకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఈ కాలువలే ఆధారం

గణపవరం: పంట కాలువలన్నీ కాలుష్యకాసారాలుగా మారాయని నిట్టూరుస్తున్నారు ప్రజలు. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, పంట పొలాలకు సాగునీరు అందించే పంట కాలువలు నిర్లక్ష్యానికి గురై పెంట కాలువలుగా మారిపోతున్నా అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదు. చాలామంది పంట కాలువల్లోకి ఇళ్ల నుంచి మురుగునీరు, చెత్తను తరలించి జల కాలుష్యానికి కారమణమవుతున్నారు. దీనితో ఎక్కడ చూసినా పంట కాలువలు కాలుష్యం బారిన పడి అందులోని నీరు తాగడానికి ఏమాత్రం పనికిరాకుండా తయారవుతున్నాయి.

కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం

కాలువ గట్లను చెత్త డంపింగ్‌కు ఉపయోగించడంతో కాలుష్యానికి అవకాశం ఏర్పడుతోంది. చెత్తాచెదారం కాలువలోకి జారి నీరు కలుషితమవుతోంది. అంతేకాకుండా గట్లపై చెత్త పేరుకుపోవడంతో కాలువలు పూడుకుపోయి శివారు పొలాలకు సాగునీరు అందక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు మండలాలలో బోర్లు, పంట కాలువలతో వరి సాగవుతోంది. గణపవరం, నిడమర్రు మండలాల్లో మాత్రం పూర్తిగా పంట కాలువపైనే వరి సాగవుతోంది. ఈ రెండు మండలాల్లో సుమారు 18 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. ఈ రెండు మండలాల్లోని 40 గ్రామాల్లోని మంచినీటి చెరువులకు నీరు పంట కాలువల ద్వారానే అందుతుంది. రెండు మండలాల్లో సుమారు లక్ష మంది ప్రజలకు, పశువులకు ఈ పంట కాలువల ద్వారా వచ్చే నీరే ఆధారం. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పంట కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం ప్రజలకు, రైతులకు, పశువులకు కూడా శాపంగా పరిణమించింది.

ప్రధాన కాలువలన్నీ కాలుష్యమయం

ప్రధాన పంట కాలువలైన ఉండి కాల్వ, వెంకయ్య కాల్వ, చినకాపరవరం కాలువతో పాటు మైనర్ పంట కాలువలు ఎ.గోపవరం పంట కాలువ, మొయ్యేరు పంట కాలువ, కొమ్మర కాలువ, అత్తిలి పంట కాలువ కూడా కాలుష్యమయంగా మారుతున్నాయి.

పూడుకుపోతున్న కాలువలు

కాలువ గట్లపైనే చెత్తకుప్పలు పేరుకుపోయి నీరు కలుషితమవుతోంది. గట్ల మీద చెత్త కుప్పలకు నిప్పుపెట్టడం వల్ల ఏర్పడిన బూడిద కూడా కాలువల్లోకే కలుస్తోంది. వర్షాకాలం చెత్తకుప్పలు మొత్తం కాలువలోకి జారి నీరు కలుషితమవుతోంది. ఆ నీరే గ్రామాల్లోని మంచినీటి చెరువులకు చేరుతోంది. దీనివల్ల గ్రామాల్లో మంచినీటి చెరువులు కూడా కాలుష్యానికి గురవుతూ ఆనీరు తాగడానికి పనికి రాకుండా తయారవుతోంది. చెత్త చేరడం వల్ల కాలువలు పూడుకుపోయి శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. గణపవరం మండలంలోని మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కొందేపాడు, పిప్పర, వెంకట్రాజపురం, వరదరాజపురం, కొత్తపల్లి, సరిపల్లె, గణపవరం, నిడమర్రు మండలంలోని అడవికొలను, చానమిల్లి, పెదనిండ్రకొలను, గోపవరం, నిడమర్రు, అడవికొలను, చానమిల్లి గ్రామాల ఆయకట్టు పరిధిలో వ్యవసాయ భూములు ప్రతి పంటలోనూ సాగునీటి కొరత ఎదుర్కొంటూనే ఉంటాయి. మండలంలోని పిప్పర పంట కాలువ గతంలో స్వచ్ఛతకు మారు పేరుగా ఉండేది. కొంతకాలంగా కాలువ వెంబడి ఉన్న చిలకంపాడు, పిప్పర, అప్పనపేట, యండగండి, గరగపర్రు గ్రామాల పరిధిలో కాలువ గట్ల మీద, కాలువ గర్భంలోనూ చెత్తకుప్పలు వేయడంతో నీరు కలుషితమవుతోంది.

పంట కాలువల్లోకి కోళ్ల వ్యర్థాలు

వెంకయ్య కాలువ మొత్తం కాలుష్యానికి మారుపేరుగా నిలుస్తోంది. ఎ.గోపవరం పంట కాలువ గట్ల వెంబడి చెత్తవేయడంతో నీరు కలుషితముతోంది. అత్తిలి పంట కాలువ నుంచి వచ్చే కొమ్మర కాలువలో కోళ్ల వ్యర్థాలు, చనిపోయిన కోళ్ల కళేబరాలు పడవేయడంతోపాటు గ్రామాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు మొత్తం ఈ కాలువలోకి చేరుతున్నాయి. నిడమర్రు మండలంలో పలు గ్రామాలకు సాగు, త్రాగు నీరందించే చినకాపవరం కాలువ కూడా కాలుష్యకాసారంలా తయారైంది. కాలువ గట్లమీదే చెత్త డంపింగ్ చేయడంతో కాలువ నీరు కలుషితమవుతోంది. చేపలు, రొయ్యల చెరువుల్లోని కలుషితనీరు సైతం ఈ కాలువలోకి అక్రమంగా వదిలి వేస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పంట కాలువలను కాలుష్యం బారి నుంచి కాపాడి, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకయ్య కాలువ గట్టున చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



కాపవరం కాలువ గట్టున చెత్త పేరుకుపోయిన దృశ్యం

నేడు ప్రభుత్వ భూముల సరిహద్దుల నిర్ధారణ ప్రారంభం

దెందులూరు: రామారావుగూడెంలో పంచాయతీ శివారు మలకచర్ల రామాలయం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు గ్రామ సభ నిర్వహించనున్నట్టు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఆదివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఒక గ్రామాన్ని రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంలో భాగంగా మలకచర్ల గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వ భూములు జిరాయితీ భూముల హద్దుల నిర్ధారణ లక్ష్యమే రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ప్రభుత్వ జిరాయితీ భూముల సరిహద్దుల నిర్ధారణ యజమానులకు ముందుగా తెలియజేయడం విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులకు సహకరించటంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను వివరిస్తామన్నారు. రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు అమలుపై పూర్తిస్థాయి అవగాహన కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఇప్పటికే రామారావుగూడెం పంచాయతీ శివారు గ్రామాల్లో టాప్ టిస్ ద్వారా గ్రామసభ సమాచారం తెలియజేశామన్నారు.రామారావు గూడెం పంచాయతీ పరిధి శివారు గ్రామాల్లోని రైతులు గ్రామసభకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుమతి కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు

చింతలపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అహర్నిశలు పోరాడుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ మహాసభ ఆదివారం డి తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గురవయ్య మాట్లాడుతూ ఇటు ప్రజా పోరాటంలో అటు చట్టసభల్లో సీపీఐ నిర్వహించిన పాత్ర గణనీయమైనదని చెప్పారు. మహాసభలో వన సంరక్షణ సమితి సభ్యులకు ఒక హెక్టార్ భూమితో పాటు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.